నిజం చేదు నిషా తేనే!

స్టేషన్‌లో రైలు ఆగింది ఆమె ఒక కుర్రవాణ్ణి చంకన ఎత్తుకొన్నది రెండవ వాడి చెయ్యి పుచ్చుకొని రైలు దిగింది భర్త అంతకుముందే క్రిందికి దిగాడు పెద్దకూతురు ఆయన పక్కనే నిలబడివుంది సామాను యిద్దరు కూలీలు ఎత్తుకున్నారు అంతా వెయిటింగ్ రూమ్ వైపుకు బయలు దేరారు

ఆ స్టేషన్‌లో రెండున్నర గంటల కాలం వేచి వుండాలి ఆ తరువాత గాని వాళ్ళు వెళ్ళవలసిన రైలు రాదు

వెయిటింగ్ రూంలోకి వెళ్ళి వెళ్ళడంతోనే ఆమె ముగ్గురు పిల్లలకూ పక్కలు వేసి పడుకోమంది కొంచెం అనారోగ్యంగా వున్న భర్తను మప్లర్ చుట్టుకోమని కోప్పడింది

కొంత సేపు గడిచింది

'ఏమండోయ్। ఎవరోగాని—మనం రైలుదిగి యిక్కడకు వచ్చినప్పటినుంచీ నావైపు అదే పనిగా చూస్తున్నాడు। చూడండి అటు కాస్త!' అన్నదామె

'నీ ఆభరణాల్ని, అందాన్ని చూస్తున్నాడు ఇందులో అతని తప్పేమీ లేదు ఏమంటావు?' అని అన్నాడు భర్త భూపతి।

'మీ మాటలు మరీ విచిత్రంగా వున్నాయి ఎవరైనా దొంగేమోనండీ!'

'నిన్ను చూస్తే దొంగలుకూడా పారిపోతారు ఏం ఫరవాలేదు!'

'ప్రబోధ్ కుమార్ సన్యాల్'

'ఏం? ఎందుకని?

'బెంగాలీ ఆడవాళ్లు కలకత్తా వదిలితే చాలు — వాళ్ళకు ఎక్కడలేని సాహసం వచ్చేస్తుంది.'

'చాల్లెండి, మీ మాటలు' — సరే గాని ఆ కూలివాళ్ళను కలకత్తా ఎక్స్‌ప్రెస్ ఎక్కించడానికి రెండున్నరకు రమ్మని చెప్పారా?'

'చెప్పానుగాని — నన్ను కొంచెంసేపు పడుకోమంటావా? నిద్ర వస్తున్నది.'

'కొంచెం పాలుతాగి మరీ పడుకోండి. ఫ్లాస్కులో వున్నాయి యిస్తాను'

'మరి నువ్వేం చేస్తావు?'

'రెండు రోజుల లెక్కలు వ్రాసుకోవాలి! ఆపని పూర్తయ్యేప్పటికి రైలు టైము ఎలాగూ అవుతుంది!'

ఆమె భర్తకు పాలు అందిస్తూ వెయిటింగురూము వాకిలి వైపు చూసింది. పన్నెండు గంటలు దాటినా స్టేషన్‌లో జన సంచారం తగ్గలేదు. వస్తువులు అమ్ముకునేవాళ్ళు — అదేపనిగా కేకలు పెడుతున్నారు. దూరంగా రైలు ఇంజన్ కూతలు, గూడ్సు పెట్టెల మోతలు విన్పిస్తున్నాయి.

ఆమెకు మళ్ళీ అతను కన్పించాడు.

'ఏమండీ! కొంచెం బయటికి చూడండి!' అని ఆమె మెడను చీరె చెరగుతో పూర్తిగా కప్పుకుంది. ఆమెకు ఎందుకో భయం వేసింది.

ఆమె భర్త వాకిలి వద్దకు వెళ్ళాడు. ఆ యువకుని తలమీద టోపీ వుంది. అచ్చంగా బెంగాలీ వేషంలో వున్నాడు.

'ఏమయ్యా! ఏం కావాలి?' అని ప్రశ్నించాడు భూపతి.

'అబ్బే! ఏమీలేదండి! .. మీరు నన్ను గుర్తుపట్టారో లేదో —, నా పేరు నిరంజన చటర్జీ అండి! ఊ హుఁ మీరు నన్ను గుర్తించలేరు!' అన్నాడు యువకుడు.

మీరు నన్ను ఎరుగుదురా?' భూపతి ప్రశ్నించాడు.

'మీతో నాకు పరిచయం లేదు గాని, మీ ఆవిడను నేను బాగా ఎరుగుదునండీ' అన్నాడు యువకుడు.

'ఏమన్నావు? మా ఆవిణ్ణి బాగా ఎరుగుదువా?'

'అవునండీ!'

'చాలా విచిత్రంగా వున్నదే?'

నిరంజన్ చటర్జీ తనలోతాను నవ్వుకున్నాడు.

'ఆమె పేరు శైలబాలాదేవి కదండీ? ఒకసారి యిలా పిలుస్తారా?'

'అయితే మీరు ఆమెకు బంధువులన్నమాట.'

'అంతకంటే ఎక్కువే ననుకోండి!'

'అంటే?'

'కలకత్తాలోని గోవిందపూర్‌లో మేమంతా ఒకేచోట వుండేవాళ్ళం!'

'ఓహో! మీరు బాల్య స్నేహితులన్నమాట! బాగుంది' అని భూపతి

నవ్వుతూ–లోపలికి రెండడుగులు వేసి–
'ఇదుగో! కొంచెమిలారా!' అని కేక వేశాడు

ఆమె రానని సైగచేసి చెప్పింది

"ఫరవాలేదులే రా! నీ చిన్ననాటి పరిచయస్థుడు! ఖద్దరు బట్టలూ ఈయనా చూస్తే – గాంధీగారి శిష్యుడులాగా వున్నాడు! ఫరవాలేదులే రా!" అని భూపతి కేకవేసి చెప్పాడు

'నేనే లోపలికి వస్తాలెండి!' అని నిరంజన్ లోనికొచ్చాడు

'అరే! నువ్వటోయ్!' అన్నది శైలబాల ఆ యువకుణ్ణి తేరిపార చూసి

'ఎవరో చెప్పుకో చూస్తా!' అన్నాడు నిరంజన్ నవ్వుతూ।

'శ్రీకాంత్‌వి' అన్నది శైలబాల

'ఏమిటీ? శ్రీకాంతా?' అని ప్రశ్నించాడు ఆశ్చర్యంగా భూపతి!

'అవునండి! ఇతగాడి పేరు నిరంజనే అయినా చిన్నప్పుడు మేమంతా శ్రీకాంత్ అని పిలిచేవాళ్ళం ఎంత అమాయకంగా వుండేవాడని చిన్నప్పుడు! ఏమయ్యా! నీవిక్కడ ఎట్లా వూడిపడ్డావో చెప్పావు కాదు?' అని శైలబాల అతనికి మరింత దగ్గరగా వచ్చి నిలబడింది

'మనిషివి బాగా మారిపోయావు సుమా! చిన్నప్పుడు గాలికి కొట్టుక పోయే వగుదాకులాగా సన్నగా వుండే వాడివి! ఇప్పుడు బాగా లావయ్యావు కొంచెం రంగుకూడా మారింది ఏమిటి సంగతులు?' అన్నది శైలబాల – అతని వైపు చూస్తూ

"నన్ను శ్రీకాంత్' అని అంటేగాని నేను ఏమీ చెప్పను" అని అన్నాడు నిరంజన్ ముగ్గురూ ఒక్కసారిగా నవ్వారు

"ఏమండోయ్! ఇతన్ని మీరు మన పెళ్ళి రోజున చూసేవుంటారు అయినా పదకొండు సంవత్సరాలనాటి సంగతి!– ఇతనెవరో తెలుసునాండ? మా ఇంట్లో అద్దెకుండేవాళ్ళ – మణి పిన్నిగారి కొడు కండీ!. .ఏమయ్యా పిన్ని ఎక్కడున్నది?"

'లక్నోలో వున్నది'

'మీచెల్లెలు బావున్నదా? అనిమాకు పెళ్ళయిందా?'

"అయింది అందరూ యిప్పుడు అత్తగారింటికి వెళ్ళిపోయారు"

"ఏమయ్యా నిరంజన్! పెళ్ళి చేసుకున్నావా?"

'చేసుకున్నా!'

'చేసుకున్నావా? మీ ఆవిడెక్కడ? పిల్లలు ఏమైనా?'

'ఒక మగపిల్లవాడు! పక్క గదిలో వున్నారు!'

'అలాగా! అయితే వచ్చి చూస్తాను. మేము గాలి మార్పుకోసం సిమ్లా వెళ్ళి వస్తున్నాం' అని అన్నది శైలబాల సంతోషంతో!

భూపతి వెళ్ళి పక్క మీద కూర్చున్నాడు

'మీ పెళ్ళి రోజున నేను భోజనాలు కూడా వడ్డించా నండోయ్ భూపతి ముఖోపాధ్యాయగారూ' అన్నాడు నిరంజన్ భూపతిని వుద్దేశించి।

'ఓహో। అలాగా।' అన్నాడు నవ్వుతూ భూపతి

'ఏ మండోయ్' పెళ్ళి అయిన తర్వాత నేను మీతో వచ్చేస్తుంటే ఇతగాడు నా చెంగు పుచ్చుకొని నేనూ నీతో వస్తానని ఎలా ఏడ్చా డనుకున్నారూ? ఇప్పుడు తలచుకుంటే సిగ్గేస్తున్నది'

'ఎందుకులే ఈ కబుర్లన్నీ? అత్తగారింట్లో కాలుబెట్టాక ఒక్క వుత్తరం ముక్కకూడా రాయలేదు నువ్వు। అంతే। ఆ తరువాత మేంకూడా ఆ యిల్లుమారి వెళ్ళిపోయాం' అని అన్నాడు నిరంజన్

'ఎంత అన్యాయం' అన్నాడు భూపతి

'చాల్లెండి మీమాటలూ మీరూ' నేనలా వెళ్ళి ఇతగాడి పెళ్ళాన్ని, పిల్లవాణ్ణి చూసివస్తా' అని శైలబాల భర్తకు పాలుతెచ్చి యిచ్చింది

'ఏమయ్యా' నీకొడుకు వయస్సెంత?'

'సంవత్సరం।'

'నీ భార్య అందంగా వుంటుందా।'

'భార్యలు ఎప్పుడూ అందంగానే వుంటారు।'

'నిజంగానా?'

'నిజమే'

"మీ ఆవిడ నిన్ను బాగా ప్రేమిస్తుందా?"

'పిల్లలు పుటిన తరువాత యింకా ప్రేమా, చట్టుబండలూనూ।' అన్నాడు భూపతి

'నిరంజన్' ఈ ప్రశ్న నేను నీ భార్యనే అడుగుతాను'

'నిరంజన్ బాబుగారూ। మీ రెంత దాకా వెడుతున్నారు?' అని ప్రశ్నించాడు భూపతి

'ఇతగాణ్ణి 'బాబూ అని పిలవవలసిన అవసరం లేదులెండి పేరుతో పిలవండి, చాలు। ఇతగాణ్ణి చూడ్డంతోటే నా బాల్యమంతా నా కళ్లెదుట కన్పిస్తున్నది ఎంత గోలచేసేవాడూ' మమ్మల్ని ఎట్లా చెండుకు తినేవాడు'. మా బొమ్మల పెట్టెలో డబ్బులుకూడా బతక నిచ్చేవాడు కాదు' ఏమయ్యా' ఆ సంగతులన్నీ నీకు గుర్తున్నాయా?'

'ఉహుఁ' అన్నాడు నిరంజన్ నవ్వుతూ'

'సరే పద, వెడదాం' ఏమండీ టైమెంత యింది?' అని శైలబాల ప్రశ్నించింది

'ఒంటిగంటయింది మీరు వెళ్ళవలసినబండి రెండున్నరకు గాని రాదు మా లక్నో రైలు మూడింటికి వున్నది' అని అన్నాడు నిరంజన్

'మీరు పాలు తాగి కొంచెం విశ్రాంతి

రంగుల మామయ్యా

తీసుకోండి నేను ఇతగాడి భార్యనూ, పిల్లవాణ్ణీ చూసి వస్తాను '

'ఆఁ. ఆఁ వెళ్ళిరా' అన్నాడు భూపతి

'మీరుకూడా రాకూడదూ?' అన్నాడు నిరంజన్

'వద్దులెండి, పిల్లలుకూడా వున్నారు మీరు వెళ్ళిరండి,' అన్నాడు భూపతి

శైలబాల ఒక శాలువా తెచ్చి భర్తకు కప్పి — 'నే నిప్పుడే వచ్చేస్తాను,' అని చెప్పి నిరంజన్‌తో వెయిటింగ్ రూమ్ నుంచి బయటికి నడిచింది

* * *

స్టేషన్ బయట ప్లాట్‌ఫారమ్ పొగమంచుతో నిండి వుంది జన సంచారం ఆట్టే కన్పించడం లేదు పొగమంచు కారణంగా మనుషులు దగ్గరకు వస్తేగాని తెలియడంలేదు ఏదో స్వప్నలోక వాతావరణం మాదిరిగా వున్నది ఒక చల్లని పిల్లగాలి వీచింది ఎందుకో శైలబాల హృదయం పులకించింది ఆమె తనను తాను విస్మరించుకున్నది బాహ్య ఆవరణ వదలి ఆమె బయటికి వచ్చేసింది

ఉభయులూ మౌనంగా కొంతదూరం నడిచారు

'శ్రీకాంత్! పక్కగదిలో వున్నదన్నావు, మీ ఆవిడ' మనం చాలా దూరం వచ్చేసినట్టున్నాం మీ ఆవిడ ఎక్కడున్నది?' అన్నది శైలబాల

ఆమె అందమైన మోహం వైపు

అలాగే చూస్తూ వుండిపోయాడు నిరంజన్. అతని మనస్సు చెప్ప నలవి గాని ఆనందంతో నిండిపోయింది

'శైలా నువ్వేమీ అనకుండావుంటే ఒక మాట చెబుతాను'. నేను యింకా వెనుకటిలాగానే వున్నాననుకో'' అన్నాడు నిరంజన్!

'అంటే?' అన్నది శైలబాల!

నేను పెళ్ళి చేసుకోలేదు'' అన్నాడు నిరంజన్.

శైలబాల ఆశ్చర్యానికి మేరలేక పోయింది

'మరి మీ ఆవిణ్ణి చూపిస్తానని చెప్పావేం? ఆయన నేమనుకుంటారు? ఇంతకూ నువ్వు పెళ్ళి చేసుకోలేదన్నమాట,'

'ఉహుఁ! చేసుకోలేదు కొంచెం సేపు మాట్లాడి వెళ్ళిపో!'

'అది సరే లే! ఇంతకూ నువ్వు నాతో అబద్ధం ఎందుకు చెప్పాలి?''

'పెళ్ళి చేసుకోలేదని చెప్పడానికి నాకు సిగ్గేసి అలా చెప్పాను'''

'ఇప్పుడు ఏం చేస్తున్నటు?'

"కలకత్తా లా కాలేజీలో చదువుకుంటున్నా చాలా సంవత్సరాల తర్వాత నిన్ను చూసేప్పటికి నా మనస్సుకు ఎంతో ఆనందంగా వున్నది''

'అందుకే కాబోలు అబద్ధమాడావు'' అని శైలబాల నవ్వుతూ_వెనక్కు తిరిగి చూసి_ సరే లే' ఆయన పొరపాటున బయటకి వస్తారో ఏమో! కొంచెం దూరం ముందుకు వెడదాం పద! చూస్తే బావుండదు! మొత్తానికి నీ చిలిపి చేష్టలు పోనిచ్చావు కాదు 'అని అన్నది శైలబాల

'ఇలా నువ్వు నాకు కన్పిస్తావని కలలోకూడా అనుకోలేదు కాలగర్భంలో పదకొండు సంవత్సరాలు కలిసిపోయాయి మానవుడు నిత్యం స్వప్న లోకంలో విహరిస్తూ వుంటాడు శైలా!'

'అవునుగాని నువ్వు నన్నెలా గుర్తుపట్టావు? మాటిమాటికి నావైపు చూస్తూ వుంటే ఎవరో అనుకున్నాను నిజంగా గతం ఎంత మధురమైంది! అంతా స్వప్నంలాగా వున్నది బాల్యస్నేహం ఎప్పటికీ మరుపురాదనుకుంటాను! ఆ నాటి ప్రేమానుబంధాలే వేరు' ఇప్పుడు తలచుకుంటే అంతా విచిత్రంగా వుంటుంది నిన్ను చూసేప్పటికి నిజంగా నాకు ప్రాణం లేచివచ్చినట్టయింది ఏమిటలా చూస్తున్నావు?'

'నిన్ను చూస్తున్నాను'

'నాలో ఏమి చూస్తున్నావు?'

'నీ కాటుక కళ్ళు! ఏమీ మారలేదు నీ కళ్ళల్లోని కాంతి!'

'దయ్యపు కళ్ళు అని ఎగతాళి చేసే వాడివి కదూ చిన్నప్పుడు?'

'నీ వెనుకటి సౌందర్యంకూడా చెక్కు చెదరలేదు! అలాగే కుందనపు బొమ్మలాగా వున్నావు'

'చాల్లే నీ కబుర్లు! ఇప్పుడు నేను

ముగ్గురు పిల్లల తల్లినయ్యాను. అలా ఇంకొంచెం ముందుకు వెడదాం పద!

'చీకటిగా వుంది రాళ్లూ రప్పలు, ఎగుడు దిగుళ్లూ వుంటాయేమో!'

'ఉంటే వుండనివ్వు' ఈ చలిలో యిలా నడవడం నా కెంతోబావున్నది. నిరంజన్! నువ్వు పెళ్ళి చేసుకోకపోవడమే మంచిది పెళ్ళిఅంటే ఒక బంధనం లాంటిది! ఒక మాయాజాలం లాంటిది ఈ వ్యూహంలో చిక్కుకుంటే బయటికి రావడం అతిదుర్లభం మరొకరి చెప్పు చేతల్లో బతకాలి ఇష్టంవచ్చిన రీతిగా జీవించడానికి అధికారం వుండదు హాయి అంటే నీదేనోయ్'

అలాగే ఉభయులూ ప్లాట్‌ఫారమ్ చివరదాకా నడిచివెళ్ళారు వాళ్ళకిప్పుడు ఏ బంధనమూ లేదు, ఎవరి ఆటంకం లేదు వర్తమానాన్ని వదిలేసి ఒక్కమారుగా వాళ్ళిద్దరూ గతంలోకి వెళ్ళిపోయారు వాళ్ళ వయస్సుల్ని వాళ్ళు మరచిపోయారు శైలబాల తన ఆచరణలో రవ్వంత దోషంకూడా వున్నట్లు భావించడంలేదు నైతిక బంధనాలను గురించిసైతం ఆమె ఆలోచించడంలేదు

'మీ ఆయన నాకు చాలా నచ్చాడు చాలా మంచివాడులా కన్పిస్తున్నాడు అన్నాడు నిరంజన్

'మంచివారే కాని, ఆరోగ్యం అంత మంచిది కాదు ఏదో నెట్టుకొస్తున్నా ఆయన సంగతి అలావుంచు శ్రీకాంత్... యిక్కడ గాలిలో ఎంత సువాసన వున్నదో గమనించావా?'

'అటుచూడు-అక్కడ విరిసిన గులాబీ లున్నాయి అందుకే ఈ సువాసనలు జాగ్రత్త, రైలుపట్టాలు '

శైలబాల అతని చేతిని తన చేతి లోనికి తీసుకున్నది

'శ్రీకాంత్ యిక్కడ నా కెంతో హాయిగా వుంది నిజం చెబుతున్నాను — నేను చాలా ప్రదేశాలు తిరిగాను గాని — యింత హాయిని నే నెప్పుడూ అనుభవించలేదు నా మనసంతా దూదె పింజెలా స్వేచ్ఛగా, తేలికగా గాలికి ఎగిరిపోతున్నది ఈ మెత్తటి పచ్చటి గడ్డిమీద యిలాగే కూర్చుండిపోవా లనిపిస్తున్నది మన చుట్టూ ఆవరించివున్న పొగమంచు కూడా నా కెంతో వుల్లాసాన్ని కలిగిస్తున్నది ఈ చల్లని కమ్మని గాలికి నా మేను పులకిస్తున్నది

'అవును! ఇక్కడ ఎవరూ లేరు — నువ్వూ నేనూ, నీలాల నింగీ, ఆ నింగి మీద మిలమిల లాడే తారకలు తప్ప! ఇది ఎంత మధురమైన రేయి!' అన్నాడు నిరంజన్!

'మనం ఉభయులం ఈ రోజు యిలా కలుసుకోవడం ఎంత విచిత్రం! రేపటికిది నా కొక స్వప్నం లాగా తోచవచ్చు ఇంకొంచెం ముందుకు వెడదాం శ్రీకాంత్!'

ఇంకా ముందుకా?

'అవును' నీవెంత దూరం తీసు కెడితే

అంత దూరం రావడానికి నేను సిద్ధంగా వున్నాను '

''ఆలస్యమైతే మీ ఆయన ఖంగారు పడతా రేమో ?''

'శ్రీకాంత్ ' నువ్వు నాకు వర్తమా నాన్ని గుర్తు చెయ్యకు ' మరుగుపడిన జ్ఞాపకాలన్నీ నాకిప్పుడు తలపుకు వస్తు న్నాయి ఈ గాలిలో ఏదో మత్తు వున్నది ఇంకొంచెం దూరం వెడదాం పద ' ' అని ఆమె కన్నెత్తి విన్నవించింది

'అవును ఈ గాలిలో, ఈ రాత్రిలో ఏదో మత్తువుంది రేపటికి యిదంతా కలగా మారిపోతుంది ఆనాడు నా వయస్సు కారణంగా నిన్ను గుర్తించ లేదు ఈనాడు గుర్తించాను, కాని ఈ గుర్తింపుకు ప్రయోజనంలేదు ఇంకొంచెం సేపటికి నీ లోకంలోకి నువ్వు వెళ్ళి పోతావు నిన్ను నేను పదకొండు సంవత్సరాల క్రితం చూశాను, అసలు జీవితాంతంవరకు నిన్ను చూడకుండావున్నా ఏమీ జరిగేది కాదు, కాని ఈ రోజున మాత్రం నువ్వు నా నుంచి దూరంకావడం యిష్టంలేకుండా వున్నది ఈ రోజున మనం ఉభయులం గతానికి, భవితవ్యానికి మధ్యన నిలబడివున్నాం'' అన్నాడు నిరంజన్-గొంతు ఆమె చేరువకు తెచ్చి '

రైల్వే లైను దాటి వాళ్ళిద్దరూ మరి కొంచెం ముందుకు నడిచారు ఆ దారి ఎక్కడికి వెడుతుందో, ఏమో వాళ్ళకే తెలియదు తెలుసుకోవాలని కూడా వాళ్ళకులేదు చెట్లూ-చేమలూ-పుట్టలూ-మైదానాలూ దాటుకుంటూ ముందుకు సాగిపోతున్నారు-

'శైలా ' ' అన్నాడు నిరంజన్ కొంత దూరం వెళ్ళిన తరువాత

'తిరిగి వెడదామని అనకు శ్రీకాంత్ ' ' అని శైలబాల మరింత చేరువకు వచ్చి, అతని భుజం మీద తల ఆనించి ప్రాధేయపడింది

'ఈ రోజుకు నువ్వు పరాయిదానవై పోయావు అయినా నేనొక సంగతి చెప్పడానికి సంకోచించడం లేదు ' అని నిరంజన్ ఆమె భుజం మీద తన చెయ్యి వేసి అన్నాడు

'ఏమిటా సంగతి చెప్పు ' ' అన్నది శైలబాల -కను లరమోడ్చి '

'ఆనాడు చెప్పలేక పోయాను ఈనాడు చెప్పడానికి నా మనస్సు ఎంతో వేగిర పడుతున్నది కాని ఆ విషయం చెప్పాలంటే నాకీనాడు కొంచెం సిగ్గుగా వున్నది '

శైలబాల నిట్టూర్చింది

'చాలా ఆలస్యమైంది శ్రీకాంత్ ' అయినా వినడానికి నాకేమీ అభ్యంతరం లేదు చెప్పు వింటాను '

'ఆనందాతిరేకంతో నా హృదయం పరవళ్ళు తొక్కుతున్నది నీ పొడుగాంటి శిరోజాలనుంచి గుబాళిస్తున్న పరిమళం పదకొండు సంవత్సరాల విరహాన్ని వ్యక్తం చేస్తున్నది శైలా ' 'నేను నిన్ను



"ఏవిట్రా అబ్బాయ్-అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావ్ ?"
"మరే రాములవారు అరణ్యవాసానికి వెళ్ళేటప్పుడు రేజరూ అవీ తీసుకుపోయినట్టు నే చదివేలా — మరి దండకారణ్యంలో బ్లేడులూ అవీ అమ్మే అంగళ్ళున్నట్లు రాయడం వాల్మీకి ఎందుకు మర్చిపోయాడూ ? అని "

ప్రేమిస్తున్నానని చెప్పుకునే తరుణం దాటిపోయింది నువ్వు మాతృస్థానాన్ని కూడా అలంకరించావు ఇప్పుడు మన వుభయులకు ఎటువంటి సంబంధమూ లేదు ! గతంలో మరుగుపడిపోయిన జ్ఞాపకాలు మాత్రమే మనకు మిగిలాయి '

'అవును శ్రీకాంత్ ' జీవిత మంటే ఏమిటో తెలియని రోజున, నీవు నాతో స్నేహం చేశావు జీవితమంటే ఏమిటో కళ్లు తెరిచే నాటికి పాత స్మృతులన్నీ గతంలో కలిసిపోయాయి ఒక్కటీ మిగలలేదు ఈనాడు నిన్ను చూడడంతో ఒక్కటొక్కటే అన్నీ గుర్తు కొస్తున్నాయి శ్రీకాంత్ ! ఇవ్వాళ నువ్వు పెద్దవాడ వయ్యావు, కాని నా స్మృతిపథంలో మాత్రం నీ బాల్యరూపమే నిలిచివుంది ఆ రూపమే నాకు చాలా యిష్టమైంది ' ఏమంటావు ?' అని చెమ్మగిల్లిన కళ్ళతో అన్నది — శైలబాల !

"నేనేమంటాను ? — నేను ఏమీ అనలేను ' నువ్వు నా కేమవుతావో నాకే తెలియడంలేదు — నేను నీకు సోదరుణ్ణి కాదు, చుట్టాన్ని కాదు — ఏదో ఒక తెలియని సంబంధం మాత్రం మనిద్దరి మధ్యన వున్నది ' అంతే '" అన్నాడు నిరంజన్— అవ్యక్తమైన విషాద స్వరంతో '

'ఇంకా చెప్పు శ్రీకాంత్ ' నీ మాటలు వినాలని నా మనస్సు ఎందుకో ఆరాట

పడుతున్నది ! మనకు మిగిలింది ఈ ఒక్క రాత్రే నేమో ' ఈ పదకొండు సంవత్సరాల కాలంలో నే నెప్పుడూ నిన్ను గురించి ఆలోచించనేలేదు కాని ఈ క్షణంలో మాత్రం నిన్ను గురించి తప్ప మరొక విషయం ఆలోచించడానికి నాకు మనస్కరించడంలేదు నీ కివ్వడా నికి నా దగ్గర ఏమీలేదు నీనుంచి ఏమి పొందాలోకూడా నాకు పాలుపోవడంలేదు నా హృదయంలో ప్రవహించే రక్తం ఉరకలు పెడుతున్నది ' అని ఆగిపో యింది. అర్థంకాని దుఃఖం ఆమెను కబళించగా !

అడుగులో అడుగు వేసుకుంటూ వాళ్ళిద్దరూ యింకా ముందుకు సాగిపో తున్నారు ప్రశాంతంగా వున్న ఆ నట్ట నడిరేయి, అగమ్యమార్గాబడి ఒకరికి మరొకరు తోడుగా, నీడగా నడిచి వెడు తున్నారు ఎక్కడికి వెడుతున్నారో, ఎందుకు వెడుతున్నారో వాళ్ళకే తెలి యదు ' అవ్యక్తమైన ఏదో ఒక మధుర భావం వాళ్ళ నలా నడిపిస్తున్నది. ఏదో తెలియని ఒక అనుబంధం వాళ్ళ నలా ముందుకు సాపొమ్మని ఆదేశిస్తున్నది ఉభయులూ ఊహల దోనెల్లో విహరిస్తూ ముందుకు ఇంకా ముందుకు సాగి పోయారు

*   *   *

'నిరంజన్ '' అని పిలిచింది – శైల బాల తడబడుతూ ఆమె జుట్టుముడి వూడి పోయింది ఆమె తూలి కింద పడ బోయింది నిరంజన్ ఆమెను రెండు చేతులతో పట్టుకుని పైకిలేపుతూ–'ఏమిటి శైలా ?' అన్నాడు

'ఏమిటో నోటినుంచి మాటలు పెగిలి రావడంలేదు గొంతు పూడిపోయినట్టుగా వుంది '

'వెనక్కి తిరిగి వెడదాం పద '

శైలబాల నిరంజన్ వైపు చూసింది–కనురెప్ప అయినా కదల్చకుండా

'నిరంజన్ ! నీమీద ఎవరైనా నింద మోపితే – తప్పు నాదికాదని చెప్పు ' ఈమే నన్ను ప్రేరేపించి బయటికి తీసు కెళ్ళిందని చెప్పు !'

'అలిసిపోయినట్టున్నావు వెళదాం పద !'

'నిరంజన్ ' మరికొంచెంసేపు నన్ను నీతో వుండనివ్వు '

'శైలా '

'ఏమిటి ?'

'మనం చేసింది పొరపాటా ?'

'ఏమో ?'

'ఇలా చేయడం తప్పుకదూ ?'

'నిరంజన్ ' నేను ఈ రోజున నీకు చాలా దగ్గరగా వచ్చాను నేను నిన్ను మరిపించి మురిపించి, ఇంతవరకు తీసు కొచ్చాను నన్ను మన్నించు నిరంజన్ !' అని శైలబాల విన్నవించుకున్నది

'మన్నించడానికి నువ్వు చేసిన తప్పేమిటో నాకర్థం కావడం లేదు

మనిద్దరం. యింకా చిన్న పిల్లలమే!' అని అన్నాడు అపేక్షగా నిరంజన్!

ఇద్దరూ వెనక్కు నడిచి స్టేషన్ చేరుకున్నారు అక్కడ దీపాల కాంతిని, జన సందోహాన్ని చూసే ఏటికి వాళ్ళ కలలన్నీ కరిగిపోయాయి

'శైలా! కళ్ళు తుడుచుకో!.. రెండున్నర కావస్తున్నది నీ చిరునామా ఏమిటో చెప్పు' అని అన్నాడు నిరంజన్.

శైలబాల జుట్టుముడి సరిజేసుకుంది కళ్ళు తుడుచుకొని చీర చెంగు సర్దుకుంది

'గానుగ ఎద్దుల్లాగా మళ్ళీ మనం మొదటికే వచ్చామన్న మాట! బావుంది-' అని మాత్రమే అనగలిగింది శైలబాల

ఆమెను వదిలి వెళ్ళవలసిన సమయం ఆసన్నమవుతున్నందుకు బాధ డుతూ నిరంజన్ ఆమె మొహం వైపు తదేకంగా చూస్తున్నాడు

సరిఘా అదేసమయానికి వెనుకనుంచి ఎవరిదో కంఠస్వరం విన్పించింది

'ఎక్కడున్నారండీ యిప్పటిదాకా! మీ కోసం స్టేషన్ అంతా వెదికాను! ఆమె ఎవరండీ? ఆమెవైపు ఎందుకలా చూస్తారు?'

శైలబాల స్తంభించి పోయింది - ఈ మాటలకు! నిరంజన్ నిలువునా నీరైపోయాడు

'ఎవరీమె?' అని అడిగింది శైలబాల నెమ్మదిగా

'నా భార్య!' అన్నాడు నిరంజన్ - నూతితోనుంచి మాట్లాడుతున్నట్టు

శైలబాల మొహం ఒక్కసారిగా కోపంతో కందగడ్డ అయిపోయింది తన కోపాన్ని అణుచుకుని-'మరి పెళ్ళి చేసుకోలేదని చెప్పావేం?' అని అన్నది - ముందుకు సాగుతూ

నిరంజన్ నోటివెంట మాటరాలేదు తల దించుకున్నాడు

శైలబాల నిరంజన్‌వైపు ఈసడింపుగా ఒకచూపు చూసి విసురుగా వెయిటింగు రూంవైపు వెళ్ళిపోయింది

నిరంజన్ లజ్జించుకున్నాడు

అనువాదం మహీధర్

సినిమా క్విజ్ జవాబులు

1 ప్రియురాలు

2 పేరంటాలు